ప్రజాశక్తి
శనివారం 8 జులై 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కును రక్షించుకుంటాం

- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకుంటే బిజెపిని బంగాళాఖాతంలో కలిపేస్తాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పలువురు వక్తల హెచ్చరిక
- విశాఖలో ఉక్కు రక్షణకు సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది ప్రాణత్యాగాలతో పోరాడి సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం ఏ త్యాగానికైనా సిపిఎం సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రైవేటీకరణ చేస్తున్న బిజెపిని బంగాళాఖాతంలో రాష్ట్ర ప్రజానీకం కలి పేయడం ఖాయమని ఉద్ఘాటించారు. స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని పలువురు వక్తలూ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల 24 గంటల దీక్ష శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైంది. దీక్షల్లో ఎం.జగ్గునాయుడు (విశాఖ), కె.లోకనాథం (అనకాపల్లి), పి.అప్పలనర్స (అల్లూరి సీతారామరాజు), టి.సూర్యనారాయణ (విజయనగరం), డి.వెంకటరమణ (మన్యం), డి.గోవిందరావు (శ్రీకాకుళం) కూర్చున్నారు. శనివారం ఉదయం 10 గంటల వరకూ జరిగే ఈ నిరాహార దీక్షను శ్రీనివాసరావు ప్రారంభిస్తూ మాట్లాడారు. సుదీర్ఘకాలంగా స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం పోరాడుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. దీనిలో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ పేరుతో వంద శాతం అమ్మకానికి పెట్టిందని తెలిపారు. రాష్ట్రంలోని వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు ఒక పక్క ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని చెబుతూనే మరోపక్క మిగతా 2లో..



దీక్ష చేస్తున్న వారితో కలిసి అభివాదం చేస్తున్న వి.శ్రీనివాసరావు, చిత్రంలో ఎంవిఎస్.శర్మ తదితరులు

మెయిన్ రోడ్డు విస్తరణపై హైకోర్టు స్టే

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలోని మెయిన్ రోడ్డు విస్తరణ పనులపై హైకోర్టు స్టే విధించింది. ఈ విషయాన్ని మెయిన్ రోడ్డులోని వర్తకులు మీడియాకు తెలిపారు. జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్ట్ ఆఫీస్ వరకు ఉన్న సుమారు 2.4 కిలోమీటర్ల పొడవు ఉన్న మెయిన్ రోడ్డును 60 అడుగుల వెడల్పుతో విస్తరించే పనులను జివిఎంసి అధికారులు ఇటీవల చేపట్టారు. విస్తరణలో కొంతమంది వర్తకులు తమ నిర్మాణాలను విస్తరణకు అవసరమైనంత మేర స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. కొన్నింటిని జివిఎంసి అధికారులు తొలగించారు. అయితే విస్తరణలో కోల్పోతున్న తమ నిర్మాణాలకు జివిఎంసి నష్ట పరిహారం టిడిఆర్ రూపంలో కాకుండా నగదు రూపంలో చెల్లించాలని వర్తకులు డిమాండ్ చేశారు. వారు బహిరంగంగా నిరసన తెలిపారు. అయినప్పటికీ జివిఎంసి అధికారులు స్పందించలేదు. ఈ నేపథ్యంలో కొందరు వర్తకులు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే ఇచ్చింది. రోడ్డు విస్తరణకు తాము అభ్యంతరం కాదని, టిడిఆర్ బదులు నగదు ఇవ్వాలని మాత్రమే తాము కోరుతున్నామని వారు తెలిపారు.

స్టే ఆర్డర్ చేరలేదు : జోన్ 4 కమిషనర్ శివప్రసాద్

ఈ విషయమై జివిఎంసి జోన్ 4 కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ భవన యజమానుల అంగీకారంతోనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు.

విస్తరణలో 442 ఆస్తులు ఉండగా వీటిలో 26 భవనాలు విస్తరణకు ఎటువంటి అవరోధంగా లేవన్నారు. 2018లో 22 మందికి, ఆ తర్వాత 200 మందికి టిడిఆర్‌లు ఇచ్చామన్నారు. వారందరూ అంగీకారం తెలిపారన్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ మంజూరు కావడంతో పనులు చేపట్టామన్నారు. హైకోర్టు 'స్టే' విధించిన విషయం తమకు లిఖితపూర్వకంగా చేరలేదన్నారు.

9న ఒబెరాయ్ లగ్జరీ రిసార్ట్‌కు శంకుస్థాపన

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున వెల్లడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈ నెల 9న వైఎస్ఆర్ జిల్లా గండికోట నుంచి వర్చువల్ విధానం ద్వారా విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరంలో నిర్మించబోయే ఒబెరాయ్ గ్రూపునకు చెందిన ఏడు నక్షత్రాల లగ్జరీ రిసార్ట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ విషయాన్ని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

మెడికల్ లిప్స్ నిరసన

వార్త 2లో..

స్మార్ట్ నానో టెక్నాలజీతో బహుళ ప్రయోజనాలు

వార్త 3లో..

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

వార్త 3లో..



సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ వై.శ్రీనివాసరావు

సృజనాత్మక ఆలోచనలతో పనిచేయండి

ఎయులో డిజైన్ థింకింగ్‌పై జాతీయ సదస్సు ప్రారంభం వార్త మెయిన్‌లో..

భారీగా మత్తు ఇంజెక్షన్లు పట్టివేత

ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో భారీ సంఖ్యలో మత్తు ఇంజెక్షన్లు పట్టుబడ్డాయి. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్మా క్యాంపు వద్ద 850 అంపుల్స్ ఇంజెక్షన్లను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ వర్మ కేసు వివరాలను తన కార్యాలయంలో మీడియాకు వివరించారు. నగరంలోని బర్మా క్యాంపునకు చెందిన గడ్డం కల్యాణ్ కుమార్ పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజెక్షన్‌లను ఒక బాక్స్‌కు రూ.వెయ్యి చెల్లించి ఇండియా మార్ట్ ఆన్‌లైన్ షాపింగ్ యాప్ డీలర్ హరీష్ నుంచి తరుచూ కొనుగోలు చేసేవాడు. అదే ప్రాంతానికి చెందిన చిన్నగొడవ ప్రసాద్, పెద్దపూడి రాంప్రసాద్, వాసుపల్లి బాల అప్పలస్వామి, పల్లివెల్ల సంతోష్ కుమార్‌లకు అదే బాక్సును రూ.2 వేలుకు విక్రయించేవాడు. అనంతరం వారు బాక్స్‌లోని ఒక్కొక్క అంపిల్‌ను రూ.300 నుంచి రూ.350కి ఇతరులకు విక్రయించేవారు. ఈ విక్రయాల సంగతి తెలిసి డిసిపి - 2 ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనాథుడు పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.త్రినాధరావు, వెస్ట్ సబ్ డివిజన్ బాధ్యులు ఎ.నరసింహమూర్తి బృందం దాడులు నిర్వహించింది. కల్యాణ్ కుమార్ ఇంట్లో ఉండగానే ఈ దాడులు జరిగాయి. ఈ క్రమంలో అతనితో సహా ఐదుగురిని అరెస్టు చేశారు. సదరు ఇంజెక్షన్లను శాస్త్రచికిత్సల సమయంలో పెయిన్ కిల్లర్స్‌గా వాడతారు. మందుల లైసెన్స్ ఉన్న ఆసుపత్రులు లేదా మెడికల్ షాపుల్లో మాత్రమే విక్రయించాల్సి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా సదరు వ్యక్తులు విక్రయిస్తుండటంతో కేసును మరింత లోతుగా పోలీసులు విచారిస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న మత్తు ఇంజెక్షన్లను చూపుతున్న సిపి త్రివిక్రమ వర్మ



అహ్మదాబాద్‌లో పర్యటిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

అహ్మదాబాద్‌లో విశాఖ మేయర్ హెరిటేజ్ వాక్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న జి-20, అర్బన్-20 సదస్సులో విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి రెండో రోజైన శుక్రవారమూ పాల్గొన్నారు. అందులో భాగంగా జాతీయ, అంతర్జాతీయ మేయర్లతో కలిసి ఆమె అహ్మదాబాద్‌లో ఉదయం 'హెరిటేజ్ వాక్' నిర్వహించారు. నడుచుకుంటూ వెళ్లి అక్కడి ఏడు చారిత్రాత్మక కట్టడాలను పరిశీలించారు. కాలుపుర్ నారాయణ్ టెంపుల్, కవి దాల్పత్రం చౌక్, శాంతినాథ్ నిపూల్, తాంక్షల్ ని హవేలీ, అష్టపట్టి దేహర్సర్, హర్‌కున్వార్ శేతని మేన్షన్, జామా మసీదు విశేషాలను అహ్మదాబాద్ మేయర్ సమక్షంలో అక్కడి గైడ్ వీరందరికీ వివరించారు.



నిరసన తెలుపుతున్న మెడికల్ రిప్రజెంటేటివ్స్

మెడికల్ రిప్స్ నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మెడికల్ రిప్రజెంటేటివ్ కావాలంటే అత్యంత నైపుణ్యం, జ్ఞానం, పట్టుదల, కార్యదీక్ష అవసరమని, అటువంటి వారిని హైలీ స్కిల్ క్యాటగిరీగా గుర్తించి కనీస వేతనాలు నిర్ణయించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అనంతరం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్స్‌ను అన్‌స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు నిర్ణయించడం అన్యాయమన్నారు. హైలీ స్కిల్ క్యాటగిరీగా గుర్తించాలన్నారు. సేల్స్ ప్రమోషన్‌ని ఇండస్ట్రీగా పరిగణించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఆరు మాసాల పాటు మెటర్నిటీ లీవు ఇవ్వాలన్నారు. సోషల్ వెల్ఫేర్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. సేల్స్ ప్రమోషనల్ ఎంప్లాయీస్ యాక్ట్ చేసి రక్షణ కల్పించాలన్నారు. కార్మిక చట్టాలను పాటించని యాజమాన్యాలను శిక్షించాలన్నారు. సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ప్రవంత్, కోశాధికారి చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

రైలు ప్రమాద ఘటనపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద ఘటనపై తక్షణం విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ బిసి సెల్ వైస్ ఛైర్మన్ తోట వాసుదేవరావు ఒక ప్రకటనలో శుక్రవారం డిమాండ్ చేశారు. ప్రమాదంలో ఆరు బోగీలు అగ్నికి ఆహుతి కాగా, వీటిలో ఐదు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులెవరూ చనిపోకపోయినా, వారి సామగ్రికి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. రాత్రివేళ ఈ ఘటన జరిగి ఉంటే ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయేవారని తెలిపారు. కేంద్రంలోని రైల్వే శాఖ అసమర్థత వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

పాకలోనే గుమ్మళ్లపాలెం పాఠశాల నిర్వహణ

ప్రజాశక్తి-కొయ్యూరు : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని, నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారిపోయాయని ప్రభుత్వం చేస్తున్న ఊదరగొట్టే ప్రచారం వట్టి నీటిమూటలేనని మండలంలోని బంగారమ్మపేట శివారు గుమ్మళ్లపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను చూస్తూ తెలుస్తుంది. ఈ పాఠశాలకు కనీసం భవనం లేని దుస్థితి నెలకొంది. గ్రామస్తులు నిర్మించిన పాకలోనే గత ఎనిమిదేళ్లుగా పాఠశాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు లేవు. కనీస వసతుల ఊసే లేదు. వర్షానికి పాక కారిపోతుంది. దీంతో వర్షమొస్తే విద్యార్థులకు సెలవులు ఇస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ఈ పాఠశాలకు భవనం నిర్మించాలని, కనీస వసతులు కల్పించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఉక్కును రక్షించుకుంటాం

బిజెపితో అంటకాగుతున్నాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమం నిర్మిస్తామన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ప్రైవేటీకరణకు ఆస్కారమిస్తే గంగవరం పోర్టులోని అనుభవమే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోనూ ఎదురవుతుందని అన్నారు. స్థానిక కార్మికులను నెట్టేసే విధానం గంగవరం పోర్టు యాజమాన్యం తీసుకుందని తెలిపారు. ఉత్తరాంధ్రలో రాజకీయ పార్టీలు, ఎంఎల్‌ఎల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు ఎప్పుడూ నిలదొక్కుకోలేదని, ప్రజా, కార్మిక పోరాటాలతోనే నిలబడగలిగాయని పేర్కొంటూ షిప్‌యార్డు, బిహెచ్‌పివి, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పోరాటాలను ఉటంకించారు. నాడు వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలని పావులు కదపగా కార్మికవర్గం తిప్పికొట్టిందన్నారు. బాక్సైట్ వ్యతిరేక పోరాటం ఎలా సాగిందో వివరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కావాలని జరిగిన పోరాటంలో ఇప్పుడున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తాత గుడివాడ అప్పన్న నిలబడగా, నేడు స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు కేంద్రం చూస్తుంటే అందుకు అనుగుణంగా మనవడు అమర్‌నాథ్ మధ్యవర్తిత్వం వహిస్తూ ముందుకెళ్తున్నాడని విమర్శించారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ జార్జి విక్టర్ మాట్లాడుతూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ల పోషణకారునిగా మోడీ ఉన్నారన్నారు. దేశంలోని ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా వ్యవహరించడం లేదన్నారు. 2024 ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు ప్రజలు, కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ ప్లాంట్ కోసం నేడు జరుగుతున్న పోరాటం.. ఉత్తరాంధ్ర ప్రజల భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు దుందుడుకుగా ముందుకు వెళ్లడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌పై అసెంబ్లీలో తీర్మానం చేశామని సరిపెట్టకుండా ఉత్తరాంధ్ర ప్రజల ప్రయోజనాలకు పెద్దపీట వేయాలన్నారు.



దీక్షా శిబిరంలోనే రాత్రి వేళ నిద్రిస్తున్న సిపిఎం జిల్లాల కార్యదర్శులు

పలువురు మద్దతు

సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు చేపట్టిన దీక్షకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, ప్రభాకరరావు, ఐలు రాష్ట్ర నాయకులు బివి.రామాంజనేయులు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జె.అయోధ్యరామ్ సహా ఎన్.రామచంద్రరావు (ఐఎన్‌టియుసి), విశ్వ రామ్మోహన్‌కుమార్ (టిఎన్‌టియుసి), సురేష్ (సిఎఫ్‌టియుఐ), రమణారెడ్డి (డిఐఆర్), కె.శంకరరావు (ఎఐసిటియు), ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.నాయినబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, వార్వా జిల్లా కార్యదర్శి బిబి.గణేష్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నక్కా లక్ష్మణరావు, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.సత్యనారాయణ, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి మురళీధర్, తదితరులు మద్దతు తెలిపారు. సిఐటియు ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు కెఎం.శ్రీనివాసరావు, జి.కోటేశ్వరరావు, అమ్మన్నాయుడు, సురేష్, పబ్లిక్ సెక్టార్ కో - ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మద్దతు తెలిపేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు

ఉక్కు పరిరక్షణకు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇప్పటికే ప్రజలు విసిగి వేసారి ఉన్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు కట్టబెట్టి తద్వారా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందన్నారు. ఆ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు సిపిఎం ప్రజలతో కలిసి పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని ప్రభుత్వ రంగ ఆస్తులను అమ్మే హక్కు మోడీకి ఎవరిచ్చారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామంటే ఉత్తరాంధ్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు.

రైటర్స్ అకాడమీ ఛైర్మన్, లీడర్ పత్రిక సంపాదకులు వివి.రమణమూర్తి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో మోడీ చేస్తున్న ద్రోహంపై రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు స్పందించకపోవడం శోచనీయమన్నారు. నేడు గంగవరం పోర్టు కార్మికులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులే ప్రైవేటీకరణ తరువాత స్టీల్‌ప్లాంట్ కార్మికులూ ఎదుర్కోనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో దీక్షలకు కూర్చున్న వారిని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఆహ్వానించారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ దీక్ష ప్రారంభ సభకు అధ్యక్షత వహించారు.

గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, వాటికి సహకరించినా వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని రాజవొమ్మంగి సీఐ షేక్ బాజీలాల్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా పై మండలంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు టిజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాండమ్ డైనమిక్ వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడ్డ వారు, తరచూ గంజాయి వ్యాపారం చేసేవారు, వారికి సహకరించే వారికి గంజాయి రవాణా తక్షణం మానుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పోలీస్ హెచ్చరికలు తిరస్కరిస్తే పీడీయాక్టు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే మండలంలోని అనేక గ్రామాల్లో గంజాయి అక్రమ రవాణా, ఫేక్ లోన్ యాప్‌లు వలన కలిగే అనర్థాలు గూర్చి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. వాహనదారుడు రికార్డులు, లైసెన్సు కలిగి ఉండడంతో బాటు ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లరాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ఆటోలలో పరిమితిమించి ప్రయాణికులను ఎక్కించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి జడ్డంగి ఎస్ఐలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లు పట్టివేత

ప్రజాశక్తి - మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం ఫారెస్ట్ సర్కిల్‌లో తులసిపాక ఫారెస్ట్ చెకపోస్ట్ వద్ద బుధవారం నాడు వాహన తనిఖీలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ నుండి ఒడిశాకు అక్రమంగా రవాణా చేస్తున్న తాబేళ్లను పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 172 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారు, మరొకరు ఆంధ్రప్రదేశ్ కి చెందిన వారు. నిందితులని రాజమండ్రి కోర్ట్ ముందు హాజరు పరచగా, 14 రోజులు జ్యుడిషల్ రిమాండ్‌కి తరలించారు. ఈ తనిఖీలలో ఎఫ్ఎస్ఒ లక్కవరం రేంజ్ పి. విజయకుమార్, ఎఫ్‌బిఒ సరిత పాల్గొన్నారు.

IN THE HONOURBLE COURT OF II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S. No. 60 / 2019

Between:
Smt. J.Sri Devi ... Plaintiff
And:
S.Venkateswararao (Died) & 2 others ...Defendants

NOTICE TO 3rd DEFENDENT

To,
Sodha Pavan Kumar
S/o. Late Venkateswara Rao, Hindu, aged about 35 years, D.No. 8-2/20, Flat No. 505, Vasavi Enclave, Bakkannapalem, Madhurawada, Visakhapatnam - 40

Please take notice that the above named plaintiff filed the above suit against you for recovery of amount based on the foot of promissory note which was executed by your father and mother. During pendency of the suit your father had Expired. Subsequently you are added as party as legal heir to your father. The above matter stands posted for your notice on **26-07-2023 at 10-30 A.M.** Hence you are hereby summoned to appear before the above said Honourable Court either in person or through your advocate without fail, else the matter will be determined in your absence basing on the material available in the Court.

C.RAM MANOHAR
C.VENKATESh
Advocates
3rd Floor, Classic Plaza, Madhava Street, Dabagardens, Visakhapatnam-20
Cell: 8019501863, 9948190560

Visakhapatnam
Dt. 7-72023

మహారాజశ్రీ నర్సీపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 165/2022

Between:
శానాపతి లక్ష్మిబాయి, భర్త సూర్యనారాయణ వయస్సు 58 సం॥లు యలమంచిలి మున్సిపాల్టీ మరియు మండలం, విశాఖపట్నం జిల్లా. . . . వాది
And:
పంచాద లోవతల్లి, భర్త పంచాద నాగ సత్యనారాయణ, వయస్సు 33 సం॥లు, హిందూ, కోరాడ వారి స్ట్రీట్, మార్కండరాజు పేట, తుని టౌన్ మరియు తుని మండలం, తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుత నివాసం పరదేశమ్మకోలనీ, యర్రవరం గ్రామము, యలమంచిలి మున్సిపాలిటీ మరియు మండలం, విశాఖపట్నం జిల్లా. . . . ప్రతివాది

దావా సమన్లు

యీ నెంబరు దావా వాది పేరున మీరు తేది: **21-03-2019దిన** వ్రాయించి యిచ్చిన ఆస్తాదీన తనఖా దస్తావేజు తాలూకా అసలు వృద్ధులు రూ. 6,96,000/- (అక్షరములా ఆరు లక్షలు తొంబై ఆరు వేల రూపాయలు) కును దావా ఖర్చులు దర్బులా వడ్డీ రాబట్టే నిమిత్తం వాది పై నెంబరు దావా మీపై దాఖలు చేసియున్నారు. అందు విషయమై మీకు ఎట్టి ఆక్షేపణలు యున్నచో **తేది: 30-08-2023దీన ఉదయం 10-30 గంటలకు** పై కోర్టు వారి యెదుట హాజరై మనవి చేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు ఎక్స్‌పార్టీ ఆర్డర్ జారీకాబడును యిందు మూలంగా మీకు తెలియపర్చడమైనది.

కె.ఆర్.వి.సత్యనారాయణ
వాది తరపు అడ్వకేట్,
నర్సీపట్నం.
నర్సీపట్నం,
తే:7-7-23
సెల్: 9849363542

న్యాయమూర్తుల బదిలీలు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా ఇక్కడే రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న ఎస్ శ్రీదేవిని నియమించారు. ఇక్కడ న్యాయమూర్తిగా విధులు నిర్వహించిన తిరుమలరావు ఉద్యోగ విరమణతో ఖాళీగా ఉన్న ఆ స్థానంలో శ్రీదేవిని నియమించారు. ఇక్కడ ఖాళీ అవుతున్న రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా కర్నూల్‌లోని ప్రత్యేక సిబిఐ కోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటరమణను నియమించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : విశాఖపట్నం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్, మరో న్యాయమూర్తి సోమయాజులు శనివారం నగరానికి రానున్నారని విశాఖపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు తెలిపారు. జిల్లాలోని జూనియర్, సీనియర్ జిల్లా న్యాయమూర్తులతో ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో జస్టిస్ యు దుర్గాప్రసాద్ పాల్గొని, అన్ని న్యాయస్థానాల్లో కేసుల్లో విచారణను సమీక్షించనున్నారు. శనివారం సాయంకాలం జిల్లా న్యాయవాదుల సంఘం, డిడిఎం ఆఫీస్ జూనియర్ న్యాయవాదులు ఆధ్వర్యంలో దసపల్లా హోటల్‌లో ఇటీవల మృతి చెందిన సీనియర్ న్యాయవాది దుర్వాసుల దక్షిణామూర్తి సంస్మరణ కార్యక్రమంలో జస్టిస్ యు.దుర్గాప్రసాద్, జస్టిస్ డివిఎస్-ఎస్ సోమయాజులు పాల్గొంటారని తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ :జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురం, పైడితల్లి అమ్మవారి గుడి వద్ద శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్యాంపు కోఆర్డినేటర్ వై.పైడిరాజు, స్థానిక సంఘం నాయకులు వంకర బాబూరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు వైద్యశిబిరం ఉంటుందని, శిబిరానికి వచ్చే రోగులు ఆరోగ్యశ్రీ,ఆధార్ కార్డులతో రావాలన్నారు. మరిన్ని వివరాలకు 76610 20762, 98482 33672 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

9న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గంభీరం పంచాయతీలో ఎఎస్‌జి ఫౌండేషన్ సంస్థ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 9న ఆదివారం బోయిపాలెం ఇండియన్ బ్యాంక్ వద్ద మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఒఎస్‌జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు దళాయి శివ తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తామని, తద్వారా ప్రమాదంలో గాయాలైతే రూ. రెండు లక్షలు, మరణిస్తే రూ.మూడు లక్షలు పరిహారం వర్తిస్తుందన్నారు. దాతలు ఆధార్‌కార్డుతో వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. ఉచిత వైద్యశిబిరంలో అధికరక్తపోటు, మధుమేహానికి వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇస్తామన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 30 రక్తదాన శిబిరాలు నిర్వహించి, 1800 యూనిట్ల రక్తం సేకరించి తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా, కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారికి, అత్యవసర పరిస్థితుల్లో గుండె సంబంధిత, ఇతరత్రా వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తదానం చేస్తున్నామన్నారు.

ఈ-చలానా రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆటోలపై ఉన్న పోలీస్ ఈ-చలానా రద్దుచేసి డ్రైవర్లకు బతుకు రక్షణ కల్పించాలని ఎపి ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం రైల్వే స్టేషన్ ఎంగేజ్ జంక్షన్ వద్ద ఆటోడ్రైవర్ల ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ ఆటోలపై ఈచలానాకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 21, అలాగే కార్లు, లారీలు, ఓలాల ట్యాక్స్‌ను పెంచుతూ జారీ చేసిన జిఒ 31 రద్దు చేయాలని కోరారు. ఒకవైపు నిత్యావసరాలు, కూర గాయలు, వంటగ్యాస్ ధరలు, పన్నులు, ఛార్జీల మోతతో ఇబ్బందులు పడుతున్న ఆటోడ్రైవర్లకు, ఈచలానాల భారంతో జీవనం దుర్భరమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోస్టాండ్ అధ్యక్షులు వై.వెంకట్, జె.గణేష్ కుమార్, ఎం.ఎ.ఖాన్, చిన్న రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు

స్మార్ట్ నానో టెక్నాలజీతో బహుళ ప్రయోజనాలు

గీతంలో అంతర్జాతీయ సదస్సు



శాస్త్రవేత్తలను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : స్మార్ట్‌నానో టెక్నాలజీతో రూపొందించిన సాంకేతిక ఉపకరణాలు వైద్య ఆరోగ్యరంగం నుంచి శక్తి వనరుల ఉత్పాదన, నిర్మాణ రంగంలో ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తున్నాయని, భవిష్యత్తులో ఆయారంగాల స్వరూపస్వభావాలను పూర్తిగా మార్చేయనున్నాయనిగీతం వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాల శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, కెమెస్ట్రీ విభాగం, ఖతార్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న స్మార్ట్ నానో టెక్నాలజీస్ అంతర్జాతీయ సదస్సులో ఆసక్తికర చర్చలు జరిగాయి. దక్షిణ కొరియా ఇన్హా విశ్వవిద్యాలయం క్రియేటివ్ రీసెర్చి సెంటర్ డైరక్టర్ ప్రొఫెసర్ జోవాన్ కిమ్ మాట్లాడుతూ చెట్ల నుంచి లభించే నానోసెల్యులోజ్‌తో తయారయ్యే వివిధ రకాల ఉత్పత్తుల ప్రయోజనాలను వివరించారు. ఒమన్ దేశానికి చెందిన సుల్తాన్ ఖబూస్ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఖలీఫా అల్‌జబరి మాట్లాడుతూ ఫెర్రోక్రోమ్ పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలను అమెరికా, నార్వే, స్వీడన్, చైనా దేశాలలో రహదారుల నిర్మాణానికి ఇతర కట్టడాలలో ఉపయోగించడం జరుగుతోందని,అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు ఫెర్రోక్రోమ్ వ్యర్థాలను కాంక్రీట్‌తో కలిపి నానో ఉత్పత్తులుగా వాడుతున్నారన్నారు. ఖతార్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ జాన్ ఖబీబాన్ మాట్లాడుతూ త్రిడి ప్రింటింగ్ పరిజ్ఞానం ఉపయోగించి కృత్రిమంగా చర్మం తయారీ,. సెన్సార్‌లను అమర్చి కృత్రిమ చర్మం స్పందనలు సహితం గ్రహించేలా చూడవచ్చునన్నారు. ఎక్స్‌క్వింజ్ లైఫ్ సైన్సెస్ సంస్థ వ్యవస్థాపకుడు కులదీప్ రజిదా మాట్లాడుతూ అత్యవసర ఔషధాలు, టీకాలను, రక్తనిధిని నియమిత ఉష్ణోగ్రతల మధ్య ఉంచుతూ అవసరమైన ప్రాంతానికి రవాణాలో స్మార్ట్ ప్యాకేజింగ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సదస్సు కో కన్వీనర్ ప్రొఫెసర్ అనీమా దధిచి మాట్లాడుతూ సదస్సులో బయో మెటీరియల్స్, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ టెక్నాలజీ, హైడ్రోజన్ ప్రొడక్షన్, స్మార్ట్‌నానో సెన్సార్స్, టిస్యూ ఇంజనీరింగ్, త్రిడి , 4డి ప్రింటింగ్, హైటెక్ డివైజస్, ఇనార్గానిక్, సాఫ్ట్‌మెటీరియల్స్ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు ఆలోచనలు రేకెత్తించేవిగా ఉన్నాయి. ప్రొఫెసర్ వేణుగోపాల్ ప్రోగ్రాం కన్వీనర్‌గా వ్యవహరించారు. అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగియనుంది.

జీవాల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఆరిలోవ : గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాననిరాష్ట్ర గొర్రెల పెంపకందారుల అభివృద్ధి సహకార ఫెడరేషన్ చైర్మన్ జి.ప్రకాష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం వెటర్నరీ జెడి కార్యాలయంలో డాక్టర్ డి.రామకృష్ణ అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సమావేశం నిర్వహించారు. ముందుగా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా అధ్యక్షులు గంటా శ్రీరామ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు, ఉపాధ్యక్షులు సబ్బి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవాల మేతకు అన్ని మండలాల్లో బంజరు భూములను కేటాయించాలని, జీవాల కాపలాదారులకు 50 ఏళ్ళకు ఫించను అందించాలని,వారికి ప్రమాదబీమా వర్తింపజేయాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్



మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ ప్రకాష్ యాదవ్

జి.ప్రకాష్ మాట్లాడుతూ గొర్రెల పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉభయ గోదావరి జిల్లాల చైర్మన్లు ఎంవి.కృష్ణారావు, డివివి.సత్యనారాయణ మూర్తి, పశు సంవర్ధక శాఖ డిడి, ఎడి, వైద్యులు పాల్గొన్నారు.

కంటి కేన్సర్ పిల్లల ఆరోగ్య సంరక్షణకు

ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రితో ఐఒసి ఒప్పందం



ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న ఎల్‌విపిఇఐ, ఐఒసి ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కంటి కేన్సర్ బారిన పిల్లల సంరక్షణకు ఎల్‌వి.ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం ఎల్.వి.ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఐఒసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అనిల్‌కుమార్, ఎల్‌వి ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్ గర్గ్ ఒప్పందపత్రాలపై సంతకాలు చేసారు. సాధారణ ప్రజలకు కంటి కేన్సర్‌పై అవగాహన పెంచడం, కంటి కేన్సర్ ఉన్న పిల్లలకు వైద్యం, శస్త్రచికిత్సలు అందించడం, వారు త్వరితంగా స్వస్థత పొందడంలో సహాయ పడే పోషకాహార సప్లిమెంట్లను సరఫరా చేయడం వంటి మూడు కీలక అంశాలను ఈ ఒప్పందంలో పొందుపరిచారు. ఈ సందర్భంగా కంటి కేన్సర్ పిల్లల ఆరోగ్య, ప్రాణ సంరక్షణకు పరస్పరం అవగాహన ఒప్పందం కుదరి భాగస్వాములు కావడంపై ఐఒసి ఇడి అనిల్‌కుమార్, ఎల్‌విప్రసాద్ కంటి ఆసుపత్రి సేవల అధిపతి డాక్టర్ స్వాతి హర్షం వ్యక్తంచేశారు.

బస్‌షెల్టర్ ఆక్రమణతో రోడ్డుపైనే పడిగాపులు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలోని బస్సు షెల్టర్ ఆక్రమణకు గురి కావడంతో విద్యార్థులు, ప్రయాణికులు రోడ్లపై నిల్చుని బస్సు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ నిర్మించిన షెల్టర్ ఆక్రమణకు గురికావడంతో ఎండనక వాననక రోడ్లపై విద్యార్థులు ప్రయాణికులు బస్సులు కోసం ఎదురుచూస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు ప్రయాణికులు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు ఉన్న బస్‌స్టాండ్ ఆక్రమణకు గురై, ప్రయాణికులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నా పట్టించుకోని అధికారులు నిర్వాకంపై పలువుర మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఆక్రమణకు గురైన బస్‌స్టాండ్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు.



బస్సుల కోసం రోడ్డుపై వేచియున్న విద్యార్థులు, ప్రయాణికులు

నేరాలు ఘోరాలు

లారీని ఢీకొని ఆర్‌టిసి బస్సు బోల్తా

- ముగ్గురికి గాయాలు



టేకు చెట్టుపై బోల్తా పడిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట జాతీయ రహదారిపై ఆర్‌ఇసిఎస్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జంగారెడ్డిగూడెం నుంచి విశాఖపట్నం వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న లారీని ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా, మన్యం జిల్లా అంటిపేట గ్రామానికి చెందిన బక్కు గౌరీశ్వరి, విజయనగరం జిల్లా పెద్దసామలాపల్లి గ్రామానికి చెందిన జరజాపు సావిత్రి, జంగారెడ్డిగూడెం చర్చివీధికి చెందిన కేతిరెడ్డి సత్యనారాయణకు గాయాలయ్యాయి. వీరిని 108లో చికిత్స కోసం అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. పెను ప్రమాదం తప్పింది జాతీయ రహదారి కావడంతో బోల్తా పడిన బస్సును క్రేన్లుతో తీసి వేశారు. సంఘటన స్థలానికి యస్ఐ ఆదినారాయణ రెడ్డి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళావిహీనంగా ఫ్లైఓవర్ పార్కు

అధికారుల నిర్లక్ష్యంతో అధ్వానం



నందపురం కూడలిలో అధ్వానంగా ఉన్న పార్కు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం కూడలి వద్ద ఏర్పాటు చేసిన పార్కు అపరిశుభ్రం, అధ్వానంగా ఉండడంపై స్థానికులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనందపురం బ్రిడ్జి నిర్మించిన తర్వాత అక్కడ పార్కు కోసం కొంత స్థలం కేటాయించి, చుట్టూ ఫెన్సింగ్ వేసి, అందులో గడ్డిని, మొక్కలను పెంచి అందంగా తీర్చిదిద్దారు. అయితే తర్వాత పర్యవేక్షణాలోపం, పార్కును ఎవరూ పట్టించుకోకపోవడంతో కొంతమంది ఆకతాయిలకు ఆవాసంగా మారి అపరిశుభ్రమయం చేశారు. పార్కులో పచ్చదనం లేకుండా చేసేశారు. జాతీయరహదారిలో, ఫ్లైఓవర్ల కిందనున్న ఈ పార్కును అందంగా తీర్చిదిద్దితే, నిత్యం ఈ కూడలి మీదుగా రాకపోకలు సాగించే వందలాది వాహనదారులు, ప్రయాణికులకు ఆహ్లాదాన్నిచ్చేది. కానీ అధికారుల నిర్వాకం, నిర్లక్ష్యం వల్ల ఇపుడు కళావిహీనంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ పార్కును అందంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు. ఫ్లైఓవర్ నిర్మించిన కాంట్రాక్టర్లుగానీ, జివిఎంసి అధికారులుగానీ దీనిపై దృష్టి పెట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

భవన నిర్మాణ కార్మిక సమస్యలపై వినతి



మంత్రి అమర్‌కు వినతిపత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం, విశాఖ జిల్లా కమిటీ సిఐటియు ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, గౌరవాధ్యక్షులు, నేతలు వెంకటరావు, బి.శ్రీను, అనసూయ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించారని, మూడేళ్ళుగా భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లు పరిష్కరించక పెండింగ్‌లోనే ఉన్నాయని వివరించారు. సంక్షేమ బోర్డులోని నిధులు కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక కార్డులు రెన్యువల్ చేయించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, సమస్యలపై కేబినెట్‌లో చర్చించి పరిష్కారచర్యలు చేపడతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గాజువాక జోన్ సిఐటియు అధ్యక్షులు డి.రమణ, టి.శ్రీను ,రాజారావు, చిన్నారావు, కార్మికులు పాల్గొన్నారు..

సంప్రదాయ శాస్త్రాలను పాఠ్యాంశాలుగా బోధించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార: రాష్ట్రంలోని పిల్లలకు ప్రాథమిక విద్యా దశ నుంచే అన్ని తరగతుల్లో సంప్రదాయ విషయాలను పాఠ్యాంశాలుగా ఉంచి, వాటిపై బోధన సాగించేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాంకు వాస్తు జ్యోతిష్య పండితుడు లక్కోజు శివరామ కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సాంకేతికాభివృద్ధిని కాదనలేము, అదే సమయంలో భారతీయ ఖగోళశాస్త్రం, జ్యోతిష్యం, పంచాంగాల విశిష్టత, వందల ఏళ్లపూర్వం నుంచే వాటికున్న ఖచ్చిత గణాంకాలను ప్రామాణికంగా తీసుకుని, వాటిని పిల్లలకు పాఠాలు బోధించాలని కోరారు. దీనిపై సీతారాం స్పందిస్తూ, కమిషన్ చైర్మన్ అప్పారావు, సభ్యులతో చర్చించి సముచిత నిర్ణయం తీసుకుంటామన్నారు.

30న విశాఖ సంగీత కళాకారుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సంగీత సంస్థలు, గాయకులతో నెలకొల్పిన విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గానికి ఈనెల 30న సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు ప్రకటించారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కళాకారుల సంఘం సర్వసభ్య సమావేశంలోఎన్నికల తేదీలను ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ కళాకారులు, కళా సంఘాలు అనేక సమస్యలతో సతమతమౌతున్నారని, వాటిపై పోరాటానికి నేతృత్వం వహించడానికి పాలకవర్గం ఎన్నికలు అనివార్యమైందన్నారు.అర్హులు, ఆసక్తిగలవారు ఈనెల 23 లోగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు.

పాలకవర్గ ఎన్నికలకు 25న నామినేషన్ల స్వీకరణ, 30న సీక్రెట్ బ్యాలట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కళలు, కళాకారులను సేవ చేయాలన్న దృక్పథం ఉన్నవారు పోటీలో నిలబడాలని సూచించారు. మరిన్ని వివరాలకు 81796 05267 మొబైల్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు అంతకుముందు 9 మందితో ఏర్పాటైన అడ్‌హాక్ కమిటీ, చెన్నా తిరుమలరావును ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. సమావేశంలో తాత్కాలిక కమిటీ సభ్యులు కొణతాల రాజు, మహ్మద్ ఖాన్, భయ్యా శ్రీనివాస్, జెఎంఆర్ నెహ్రూ, ఫణిభూషణ్, డి. భూపతిరావు, కందర్ప రాధ, ఎం. త్రినాథరావు, గంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి

అదానీ గంగవరం పోర్టు కార్మికుల ర్యాలీ



గాజువాకలో ర్యాలీ నిర్వహిస్తున్న అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు

ప్రజాశక్తి- గాజువాక :తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు శుక్రవారం పెదగంట్యాడ నిరసన దీక్ష శిబిరం నుంచి పాత గాజువాక జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పోర్టు యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని నినదించారు. పాత గాజువాక జంక్షన్‌లో కార్మికులు మానవహారం చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో 64వ వార్డు జనసేన కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులను అదానీ యాజమాన్యం రోడ్డున పడేసిందని మండిపడ్డారు. సంప్రదింపులు ద్వారా సమస్యను పరిష్కరించకుండా, పోరాటం చేస్తున్న కార్మికులపై కక్ష గట్టి బెదిరింపులకు పాల్పడడం, తొలగించడం వంటి దుర్మార్గపు చర్యలకు పూనుకుంటోందన్నారు 73వ వార్డు టిడిపి కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల పోరాటానికి టిడిపి అండగా నిలుస్తుందని సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

సిఐటియు స్టీల్‌జోన్ ప్రధానకార్యదర్శి కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ నిర్వాసిత కార్మికులకు సాఫ్ట్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ కింద వేతనాలు చెల్లిస్తూ కార్మికులను అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం దోచుకుంటోందని మండిపడ్డారు. పెద్ద ఎత్తున కార్గో హ్యాండ్లింగ్ చేస్తూ, అంతర్జాతీయస్థాయి ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న అదానీ గంగవరం పోర్టుకు సాఫ్ట్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ కింద ఉన్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నేత జెర్రిపోతుల ముత్యాలు, కొవిరి కోదండరావు సిపిఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు సిపిఐ నేత పల్లెటి పొలయ్య స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత యూనియన్ నేతలు ఇతన భాస్కర్, ఉమ్మిడి అప్పారావు ర్యాలీలో పాల్గొని నిర్వాసిత కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, ట్రెజరర్ వాసుపల్లి ఎల్లాజీ, నాయకులు గంటిపల్లి అమ్మోరు, మాద అప్పారావు, కదిరి భూలోకరావు, గంటిపల్లి లక్ష్మయ్య, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, కొవిరి అమ్మోరు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడపగడపకూ..



కెకె.రాజును ఆశీర్వదిస్తున్న రిటైర్డు ఐఎఎస్ అధికారి

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించాలన్న లక్ష్యమని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు అన్నారు. శుక్రవారం జివిఎంసి 26వ వార్డు లలితగుడి వెనక గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ఈ పథక లక్ష్యమన్నారు. తన దృష్టికివచ్చిన అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైసిపి నేతలు బొడ్డేటి కిరణ్‌కుమార్, అమ్మాజీ, సమ్మెట్ల వెంకటేష్ గోవిందు, సంతోష్, సచివాల య, జివిఎంసి సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

'ఎకో వైజాగ్'పై చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖనంపై జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మకు వివరిస్తున్న విద్యార్థిని

ప్రజాశక్తి -పిఎం పాలెం: పర్యావరణంపై విద్యార్థుల్లో అవగాహన, సృజనాత్మకను పెంపొందించేందుకు ఎకో వైజాగ్‌పై చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ అన్నారు. శుక్రవారం రెండో జోన్ పరిధిలోని చంద్రంపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన ఎకో వైజాగ్ అంశంపై చిత్రలేఖన పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేంజర్ ఫోర్స్ అనే స్వచ్ఛందసంస్థ ఈ పోటీలను నిర్వహిస్తోందని, నగర పరిధిలో 592 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారన్నారు. చంద్రంపాలెం హైస్కూల్లో 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎకో వైజాగ్ అంశంలో ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్ అనే ఐదుఅంశాలలో ఏదేనీ ఒక అంశాన్ని ఎంచుకుని, విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు.కార్యక్రమంలో జివిఎంసి డిఇఒ శ్రీనివాసరావు, హైస్కూల్ హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుకుంటేనే సమాజంలో గౌరవం

ప్రజాశక్తి-పద్మనాభం: చదువుకుంటేనే సమాజంలో గౌరవం లభిస్తుందని ఎంపిపి కె.రాంబాబు విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో బదిలీ అయిన ఎనిమిది మంది ఉపాధ్యాయులకు సత్కారం, వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ప్రభుత్వం ఆధునిక విద్యాబోధనకు ఎన్నో సౌకర్యాలు, పథకాలను సమకూర్చుతోందని, వాటిని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగించి విద్యార్థులు ఉన్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఒక పీరియడ్‌పాటు గణిత బోధన చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో కార్యక్రమాల నిర్వహణకు వేదిక, ప్రహరీ నిర్మించాలని ఎంపిటిసి కె.లక్ష్మి కోరగా, మండల పరిషత్ నుంచి రూ.మూడు లక్షల నిధులు మంజూరు చేశారు. స్థానికుల సహకారంతో పాఠశాలలో ప్రార్థనా స్థలాన్ని చదును చేయిస్తామని. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలామణి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ తులసి పాల్గొన్నారు.

గీతం ఎసిఎం విద్యార్థి విభాగం సమావేశం



ప్రొఫెసర్ కృష్ణను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు సభ్యులుగా గల అమెరికన్ కంప్యూటింగ్ మెషినరీ (ఎసిఎమ్) విద్యార్థి విభాగం సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ వి.ఎన్.కృష్ణ పాల్గొని, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, సిఎస్ఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష, ఎసిఎమ్ విద్యార్థి విభాగం సలహాదారు డాక్టర్ జె.హైమ పాల్గొని ప్రసంగించారు.

వేతనాలు పెంచాలని కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఎన్‌జిసిఎస్‌లో స్టీల్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఉక్కు బిసి గేటు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్పత్తి రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న విశాఖ ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాల్సిన బాధ్యత ఉక్కు యాజమాన్యంపై ఉందన్నారు. 2014లో రూ.1100 పెంచిన యాజమాన్యం. 2023 లో నామమాత్రపు పెంపుతో సరిపెట్టాలనుకోవడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ గౌరవప్రదమైన వేతనాలు పెంచడానికి ఉక్కు యాజమాన్యం ముందుకు రాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పి మసేను. ఎన్ కృష్ణ. కె వరహాలు. ఎ శ్రీను. ఎన్ చంద్రరావు. ప్రసాద్ ఆనంద్. శశి బి ఆనంద్ విఆర్ఎల్ స్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల 36 గంటల ధర్నాను విజయవంతం చేయాలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

ప్రజాశక్తి -అనకాపల్లి

ఈ నెల 10న కోర్కెల దినం సందర్భంగా అంగన్వాడీల సమస్యలపై అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అఖిలభారత కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద జరుగు 36 గంటల ధర్నాలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగ శేషు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ధర్నా పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత 48 సంవత్సరాల నుంచి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అనేక సేవలందిస్తున్న అంగన్వాడీలకు కనీసం ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. తెలంగాణ కంటే అదనంగా వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి నేటికీ అమలు చేయలేదని తెలిపారు. అంగన్వాడీ ఉద్యోగులు గ్రాడ్యుటీకి అర్హులని సుప్రీంకోర్టు తెలియజేసినా దానిని అమలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 2018లో అంగన్వాడీ వర్కర్లకు రూ.1500, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1250 పెంచుతున్నామని చెప్పినా నేటికీ పెంచలేదన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్చాలని, జిఒ ప్రకారం రిటైర్ అయిన వర్కర్‌కి రూ.50వేలు హెల్పర్‌కు రూ.20వేలు పింఛన్ ఇవ్వాలని యాప్‌ల ఒత్తిడి, రాజకీయ వేధింపులు, ఒత్తిళ్లను అరికట్టాలని కోరారు. పై సమస్యల పరిష్కారానికి జరుగుతున్న ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగశేషు, అంగన్వాడీ కార్యకర్తలు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా మందపాటి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి అనకాపల్లి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు జన్మదిన వేడుకలు వుడ్‌పేటలోని ఆయన కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు, ఆత్మీయులు, 82వ వార్డు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జానకిరామరాజు అమెరికాలో ఉన్నప్పటికీ అత్యధిక సంఖ్యలో మిత్రులంతా పాల్గొనడం విశేషమన్నారు. ముందుగా కేక్ కట్ చేసి, అనంతరం పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. గాంధీనగరంలో వున్న సత్యసాయి మందిరంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్, ఆళ్ళ నాగేశ్వరరావు, గైపూరి రాజు, కోరుకొండ రాఘవ, కొండూరు రవీంద్ర, గౌరీ పతి మాస్టారు, కడిమిశెట్టి సతీష్, నడిశెట్టి మధు, దాడి బోగలింగం, సకలా గోవింద్, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు రాని వారికి సొమ్ము వాపస్

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి రామనగర్‌లో నిర్మించిన టిడ్కో ఇళ్ల నిర్మాణంలో రెండు బ్లాకుల నిర్మాణం పూర్తికానందున ఆ లబ్ధిదారులు కట్టిన సొమ్మును తిరిగి చెల్లించే విధంగా మున్సిపల్ కార్యాలయంలో ఒక కౌంటరు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ఆధ్వర్యంలో సొమ్ము వాపసు చేయడం జరుగుతుందన్నారు. ఇళు రాని లబ్ధిదారులు వారు కట్టిన సొమ్ము తాలూకు డిడి జెరాక్స్, బ్యాంక్ బుక్ జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్ సమర్పించాలని కోరారు. ఇళ్లు మంజూరు కాని లబ్ధిదారుల వాటా కింద సుమారు రూ.49 లక్షలు చెల్లించినట్లు అధికార్లు తెలిపారు. వాటిని వెంటనే చెల్లించడానికి ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇదంతా ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఏపి టౌన్‌షిప్, ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ డెవలెప్‌మెంట్ అధికార్ల చొరవతో ఇళ్లు మంజూరు కాని లబ్ధిదారులకు సొమ్ము చెల్లించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

9న బిసిల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక విజయ రెసిడెన్సిలో ఈ నెల 9న జరిగే రాష్ట్ర స్థాయి బీసీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ అసోసియేషన్ ఇన్‌ఛార్జి ఆడారి కుమారస్వామి అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రైవేటు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం, బీసీల ఐక్యత, బీసీల జన గణన, బీసీల కులగణన, సాధికారిత, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ వంటి అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలిండియా బిసి అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు పోతల ప్రసాద్ నాయుడు, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు సాదం భాస్కర్ యాదవ్, బీసీ జేఏసీ ప్రతినిధులు కూటికుప్పల సూర్యారావు, బీసీ వర్గాల ప్రతినిధులు హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పి వెంకటరావు, పి సోమశేఖర్, కొమ్మోజు రమేష్, భీమరశెట్టి శ్రీనివాస్, పెంటకోట వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు

ప్రజాశక్తి- అనకాపల్లి

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో పేదలకు చాలా మేలు జరుగుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. మండలంలోని గొలగాం పంచాయతీ కేటీవీ పాలెం, ఎల్లారమ్మ కాలనీలలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు డ్రైన్లు, ఇంటింటి కొళాయిలు కావాలని కోరగా మంత్రి స్పందిస్తూ కేటీవీ పాలెం లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి రూ.11 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. గొలగాం ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ కాలువలను ఆయన ప్రారంభించారు. ఎల్లారమ్మ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. కొత్త తలారివారిపాలెంలో రూ.17.77 లక్షలతో అభివృద్ధి చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంత్రి ప్రారంభించారు. ఈ పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడి కేంద్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్ నాగ నరసింహారావు, వైసిపి నాయకులు మల్ల బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో సీసీ కాలువలను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన వారికి నెల రోజుల్లో రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని మామిడిపాలెం గ్రామంలో జగనన్న కాలనీల కోసం ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన వారికి దానికి బదులుగా ఇచ్చిన స్థలాల రిజిస్ట్రేషన్ నెల రోజుల్లో చేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. అనకాపల్లి మండలం మామిడి పాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానంలో భాగంగా మామిడిపాలెం-మాకవరం ప్రధాన రహదారిని నిర్మించామని చెప్పారు. మామిడిపాలెంలో జగనన్న సురక్షలో శుక్రవారం 350 సర్టిఫికెట్లను జారీ చేస్తున్నామన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడం, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూడి పరదేశి నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు, గ్రామ వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నజరత్ షమీం అన్నారు. డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవాల సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పిహెచ్‌సి నుంచి మెయిన్ రోడ్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ డి.శారద, ఎంపిహెచ్‌ఈఓ జమ్ము శ్రీనివాసరావు, ఎంపిహెచ్‌ఎస్ బి. సంఘం, ఎం.మాణిక్యాంబ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొన్నా కళాశాల అధ్యాపకునికి బెస్ట్ రీసెర్చ్ అవార్డు

ప్రజాశక్తి- పరవాడ

మండలంలోని ఇ.మర్రిపాలెం గొన్నా కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి ఓం నమశివాయ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మల్టీడిసిప్లినరీ రిసెర్చ్ ఇన్ బిజినెస్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ మేనేజ్మెంట్‌లో బెస్ట్ రీ సెర్చ్ అవార్డు సాధించారు. ఈ అవార్డు స్టార్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ వారు అందించారు. ఈ సందర్భంగా గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హెమచంద్‌నాయుడు డాక్టర్ ఓం నమశివాయను కళాశాలలో సత్కరించారు. అనంతరం హేమచంద్ నాయుడు మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపకునికి ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో గొన్నా కళాశాల ప్రిన్సిపాల్ పిఎస్ఎన్ మూర్తి, విభాగ అధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవార్డు అందజేస్తున్న దృశ్యం

పౌర హక్కుల దినోత్సవం తప్పనిసరిగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ప్రతి మండలంలో పౌర హక్కుల దినోత్సవం తప్పక నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ఎస్టీ హక్కుల బాధితులకు నష్టపరిహారం పూర్తిగా చెల్లించినందుకు సంబంధిత అధికారులను ఆయన అభినందించారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ హక్కుల ఉల్లంఘన కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ నుండి జూన్ వరకు కేసుల పరిష్కారం, కొత్తగా నమోదైన కేసులను గూర్చి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన సమీక్షించారు. లీగల్ ఒపీనియన్ అంశాలను తక్షణం పూర్తి చేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలపై వచ్చిన చార్జిషీట్లను వేగంగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారం కోసం తీసుకున్న చర్యలను సమీక్షించారు. జిల్లాలో నిఘా ఏర్పాటు చేసి ఎస్సీ ఎస్టీలపై ఎటువంటి హక్కుల ఉల్లంఘనను జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పి మురళీకృష్ణ, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డిఆర్ఓ వెంకటరమణ, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్ని కృష్ణ, జయరాం, డీఎస్పీలు మహేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు కే.అప్పారావు, ఎం. అప్పలరాజు, ఆర్.మధు బాబు, ఎం. ఈశ్వరరావు, జి మరియమ్మ, డిపిఓ శిరీష రాణి, హార్టికల్చర్ ఏడి ప్రభాకర్ రావు, డిఐపిఆర్ఓ ఇంద్రావతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కెవి.రమణ, బి.అప్పారావు, జే.తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి పఠాన్‌శెట్టి, చిత్రంలో ఎస్పి మురళీకృష్ణ, జెసి జాహ్నవి తదితరులు

అనకాపల్లి-చోడవరం రోడ్డు మరమ్మతులు చేపట్టాలని రాస్తారోకో

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి-చోడవరం రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం దర్జీ నగర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రెండు వైపులా భారీ వాహనాలు నిలిచిపోయాయి. సుమారు గంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. స్థానికులు స్వచ్ఛందంగా అక్కడకు చేరుకొని రాస్తారోకో పాల్గొన్నారు. స్థానికులే కలుగజేసుకొని వాహనాలు ఎటు వెళ్లకుండా, వెళుతున్న వాహనదారులతో తమ ఇబ్బందులను మొరపెట్టుకుంటూ రాస్తారోకోకు సహకరించమని కోరారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ 15 రోజుల్లో సమస్యను పరిష్కరించకుంటే రోడ్డుపైనే వంటా-వార్పు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ మార్గంలో పెద్ద పెద్ద గోతులు పడి, దుమ్ము, ధూళితో అత్యంత అధ్వానంగా ఉన్నప్పటికీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు, ప్రజా ప్రతినిధులకు పట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కెయస్ సన్యాసిరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, దేముడు బాబు, నాగరాజు, వియ్యపు రాజు, వీరాచారి, కోరిబిల్లి శంకర్రావు, కన్నబాబు, నరాలశెట్టి సత్యనారాయణ, సత్తిబాబు, జి ఫణీంద్ర, విత్తనాల పోతురాజు, ఒమ్మి సతీష్, రమణ, వెంకట్రావు, స్థానిక వార్డు సభ్యులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సిపిఐ నాయకులు, స్థానికులు


బీరువా అందజేసిన శివకుమార్

భవిత కేంద్రానికి బీరువా వితరణ

ప్రజాశక్తి - కశింకోట

సమాజసేవకు సహకారం అందించాలని జిల్లా భవిత కేంద్రం సమన్వయకర్త శకుంతల అన్నారు. కశింకోట నెంబర్-2 పాఠశాల వద్ద భవిత కేంద్రానికి రూ.11 వేలువైన బీరువాను శివకుమార్ జ్ఞాపకార్థం ఆయన భార్య సూర్య కుమారి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శకుంతల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఐఇఆర్‌టిఇ రమణమ్మ, వికలాంగుల ఉపాధ్యాయుడు కోమాకుల వెంకటేశ్వరరావు, బాలుర హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధాన ఉపాధ్యాయులు ఆచంట రవి, నెంబర్-2 పాఠశాల ఉపాధ్యాయులు రాముునాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు సంతోష్, శ్యామల పాల్గొన్నారు.


క్రికెట్ కిట్ అందజేస్తున్న జనసేన నాయకులు

జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

మాడుగుల నియోజకవర్గంలో జనసేన గెలిపే లక్ష్యంగా యువత పనిచేయాలని నియోజకవర్గ జనసేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ అన్నారు. శుక్రవారం కె.కోటపాడులో రెల్లివీధి పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఆయన విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న యువతకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించాలన్న ఉద్దేశంతో జనసేన నాయకులు పనిచేస్తున్నామని తెలిపారు. ఉచితంగా వాలీబాల్ క్రికెట్ కిట్లు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న రెల్లి వీధి యువకులకు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుంచా అంజిబాబు, ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని తోటాడ ఆరోగ్య ఉప కేంద్రం వద్ద శుక్రవారం మండల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ విమల గిరి నేతృత్వంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సేవలన్నీ ప్రజల చెంతకే చేరుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కాండ్రేగుల లక్ష్మీ నారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా తురకలపూడి పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి సచివాలయంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 113 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. పాఠశాలను సందర్శించి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



104 వాహనం వద్ద వైద్య సిబ్బంది

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కోశాధికారి నాయినబాబు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు డిమాండ్ చేశారు. మండలంలోని చౌడువాడ, మేడిచర్ల, గొండుపాలెం ఎ.కోడూరు గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను రైతు సంఘం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ముందుగా డబ్బులు చెల్లిస్తేనే వరి విత్తనాలు తెచ్చి రైతులకు ఇస్తున్నారని, అలా కాకుండా ప్రభుత్వం వరి విత్తనాలు ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. గత నెల 30 తేదీన రైతుల సమస్యలపై అమరావతిలో ధర్నా చేపట్టినప్పుడు ఆర్‌బికెల్లో రైతుకు కావలసిన అన్ని వస్తువులు ఉంచామని ప్రభుత్వ అధికారులు చెప్పారని, కాని తమ పర్యటనలో అదంతా డల్లతనమని తేలిందని పేర్కొన్నారు. ఈనెల 10న రైతు సమస్యలపై అన్ని సచివాలయాల వద్ద వినతి పత్రాలు అందజేస్తామన్నారు. గత సీజన్లో చోడవరం సహకార చక్కెర కర్మాగారానికి చెరుకు సరఫరా చేసిన రైతులకు పేమెంట్ వెంటనే ఇవ్వాలని రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ డిమాండ్ చేశారు. చెరకు మద్దతు ధర టన్ను ఒకటికి రూ.5000 ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు పాల్గొన్నారు.


వరి విత్తనాలు చల్లి చదును చేస్తున్న మహిళా రైతులు

ముమ్మరంగా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

గత రెండు రోజులుగా వాతావరణం చల్లగా ఉండడంతో పాటు చిరుజల్లులు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. మండలంలోని దిబిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం, పెదపూడి, సీతయ్యపేట గున్నంపూడితో పాటు పలు గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో రైతులు వరి నారుమడులలో విత్తనాలను చల్లుతూ బిజీగా ఉన్నారు. గతంలో సిద్ధం చేసుకున్న ఆకుమడుల్లో వరి విత్తనాలను చల్లుతున్నారు.

విత్తన శుద్ధితో నాణ్యమైన దిగుబడి

ప్రజాశక్తి-కె.కోటపాడు

నాణ్యమైన పంట దిగుబడికి విత్తన శుద్ధి ఎంతో అవసరమని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వారాడ గ్రామంలో క్లస్టర్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సూడోమోనాస్ అనే మందుతో విత్తన శుద్ధి చేపట్టాలన్నారు. దీని వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని చెప్పారు. పశువుల గెత్తం పచ్చిరొట్ట పైరు వాడకం చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులకు విత్తన శుద్ధి , పశువుల గెత్తం, పచ్చిరొట్ట ఎరువులు వాడే విధానాన్ని వ్యవసాయ అధికారులు స్వయంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో పొలంబడి రిసోర్స్ పర్సన్ చిరంజీవి, వ్యవసాయాధికారులు విజేత, తులసీమణి, సోమశేఖర్ పాల్గొన్నారు.

అట్రాసిటీ, విజిలెన్స్ కమిటీలు నియమించాలి

ప్రజాశక్తి అనకాపల్లి

ఎస్సి ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్సీ అండ్ మోనిటరింగ్ డివిజన్ కమిటీలు నియామకం చేయాలని నేషనల్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కొల్లి చిన అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డిఓ కార్యాలయంలో శుక్రవారం ఫోరమ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు, ఉపాధ్యక్షులు కట్టమూరు మంగరాజు, చెవిటి అప్పారావుతో కలసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఎస్సి ఎస్టీ వర్గాల సమస్యలు సత్వర పరిష్కారం, హక్కులు పరిరక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం మనుమడు నక్కిన రవికుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది అభాగ్యులు, అనాథలు, నిరుపేదలకు అన్నదానం బల్లా నాగభూషణం చేతులమీదుగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మనుమడు పుట్టిన రోజు పురస్కరించుకొని అన్నదానం జరుపు కోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నక్కిన రాము, దేవాలయ అర్చకులు కోమల్లపల్లి నందు, శ్రీకాకహస్తి, వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వర రావు, పట్నాల కృష్ణ మోహన్, అల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చురుగ్గా కల్వర్టు నిర్మాణం

ప్రజాశక్తి - యలమంచిలి

మున్సిపాలిటీ పరిధి తులసీనగర్ వీధిని మెయిన్‌రోడ్డుకు కలుపుతూ నిర్మించిన కల్వర్టు స్లాబ్ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చిన్న పాటి వర్షాలకు సైతం మురుగునీరు పొంగి వీధిలోకి పారుతుండడం ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షం నీరు కుంటే మురుగునీరు చెత్తా చెదారంతో చేరుతుండడం పలువురు మున్సిపాలిటీకి ఫిర్యాదులు చేశారు. దాంతో మున్సిపాలిటీ ఆమోదం మేరకు రూ.2.5 లక్షలతో కల్వర్టు నిర్మిస్తున్నట్లు ఇంజనీరింగ్ సిబ్బంది తెలిపారు. మురుగునీటి కాల్వ ఎత్తు పెంచి శ్లాబు వేసే విధంగా డిజైన్ చేసినట్లు వారు వివరించారు. కల్వర్టుకు విముక్తి కలుగుతున్నందుకు గర్ల్స్ హైస్కూలు, కాలేజీ విద్యార్థులు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కల్వర్టు నిర్మాణ చేస్తున్న దృశ్యం

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశం


ప్రజాశక్తి-అనకాపల్లి

కళాశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత పెంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధికారులు, ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మోడల్ పాఠశాలలు, కళాశాలలో విద్యా ప్రమాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విద్యాసంస్థల నుండి ఎంతమంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు? ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఐఐటి, ఎన్ఐటి జేఎన్టీయూకి ఎందరు అర్హత పొందారో ఆరా తీశారు. ఉన్నత ప్రమాణాలతో శాస్త్ర సాంకేతిక విద్య బోధించేందుకు నిపుణులు నిష్ణాతులైన లెక్చరర్లచే ఆన్లైన్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. ప్రతివారం పరీక్ష నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచే విధంగా బోధనా అంశాలను రూపొందించాలన్నారు. ఈ విషయమై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి ఎక్కువ మంది విద్యార్థులు ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంబీఏ మొదలైన ఉన్నత విద్యలకు అర్హత సాధించేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, ఆర్ఐఓ సుజాత, డీఈఓ మహాలక్ష్మమ్మ, ఎస్సీ, బీసీ వెల్ఫేర్ డీడీలు అజయ్ బాబు, రాజేశ్వరి, ఏటిడబ్ల్యూఓ నాగ శిరీష, జిల్లాలోని పాఠశాలల ప్రిన్సిపాళ్లు, పూర్వ ప్రిన్సిపాల్ విశ్వనాథం, వివిధ కళాశాలల లెక్చరర్లు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-రోలుగుంట: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం రోలుగుంట మండల ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు స్వగ్రామమైన కొవ్వూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



సమస్యలు తెలుసుకుంటున్న ధర్మశ్రీ

నిర్వహించారు. అధికారులు, పార్టీ నాయకులతో కలిసి వార్డులోని ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ. సీఎం జగన్ పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో కొందరికే సంక్షేమ పథకాలు అందేవని, జగనన్న ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

డెంగీపై అవగాహన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 'డెంగ్యూ నివారణ మాసోత్సవాలను" పురస్కరించుకొని అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్లు శక్తి ప్రియ, ఎన్ వాసంతి తెలిపారు. హెల్త్ విజిటర్ సూర్య కుమారి ఆధ్వర్యంలో రాయవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ కు హాజరైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు గర్భిణీ స్త్రీలకు న డెంగీ, చికెన్ గున్యా, మలేరియాపై అవగాహన కల్పించారు. ఒక్కరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వై అనుష, కొండబాబు, స్థానిక సచివాలయం హెల్త్ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: తీవ్ర అనారోగ్యం పాలై విశాఖ కే.జిహెచ్‌లో చికిత్స పొందుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళ సర్పంచ్ లకోజు మౌనికను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం పరామర్శించారు. మాకవరపాలెం మండలం తాడపాల మహిళా సర్పంచ్ మౌనిక అనారోగ్యంతో కెహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గణేష్



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రకాష్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: వ్యవసాయంలో ప్రకృతి పద్ధతులు ఆచరించాలని రైతు సాధికార సంస్థ రీజినల్ టెక్నికల్ లీడ్ ప్రకాష్ కోరారు. గొలుగొండ మండలం గుండుపాలలో శుక్రవారం మహిళా సంఘాలతో కలిసి బీజామృతం తయారు చేయు విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలకరికి ముందు నవధాన్యాలతో పీఎండిఎస్ సాగు చేపట్టడంతో పొలానికి అన్ని రకాలైన పోషకాలు లభ్యమవుతాయని వివరించారు. సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ హేమసుందర్ మాట్లాడుతూ, ప్రకృతి విధానాన్ని ఆచరించడంతో పెట్టుబడి తగ్గి అన్ని పోషకాలు కలిగిన ఉత్పత్తులు దిగుబడి వస్తాయన్నారు. సంస్థ స్టేట్ రిసోర్స్ పర్సన్ దేముళ్లు మాట్లాడుతూ, మన చుట్టూ లభ్యమైన సహజ వనరులను వినియోగించి సాగు చేపట్టే విధానమే ప్రకృతి పద్ధతి అని చెప్పారు. దీనినే మన పూర్వీకులు ఆచరించే వారని, మరల మనమంతా పూర్వపు పద్ధతుల వైపు మొగ్గు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నేతల ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నియోజకవర్గంలో నెల కొన్న సమస్యలపై శుక్రవారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీలో రూ.166 కోట్లతో మొదలు పెట్టిన మంచినీటి పథకం పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయన్నారు. మాకవరపాలెం మండలం భూ నిర్వాసిత గ్రామం జి. వెంకటాపురంలో మంచినీటి కొరత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు పాల్గొన్నారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎంపిడిఒ, ఉపాధ్యాయులు

స్వావలంబన కార్డులకు పేర్లు నమోదు

ప్రజాశక్తి-రావికమతం: ఒకే దేశం - ఒకే కార్డు అనే నినాదంతో దివ్యాంగులందరికీ దేశంలో ఒకే గుర్తింపు కార్డు ఉండాలన్న ఉద్దేశంతో ఈ స్వావలంబన కార్డులను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో వెంకన్న బాబు అన్నారు. మండలంలో మేడివాడ జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఆ కార్యక్రమంలో 92 మంది దివ్యాంగ విద్యార్థులకు స్వావలంబన కార్డులకు నమోదు చేశారు. వీరి అందరికీ త్వరలో కార్డులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం నుండి అన్ని రకాల సేవలను పొందడానికి ఉపయోగపడుతుందని అన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పాసైన 17 మంది దివ్యాంగ విద్యార్థులను, దివ్యాంగ విద్యార్థులకు సహాయకులుగా (స్క్రయబ్) పరీక్షలు రాసిన విద్యార్థులు శిష్టి హేమలత, శిష్టి కార్తీక్, ఎన్నంశెట్టి కీర్తన, వజ్రపు షణ్ముఖ్, మానస లను ఎంపీడీవో కె.వెంకన్నబాబు, మండల విద్యాశాఖ అధికారి ఎన్.బ్రహ్మాజీ, మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రామారావులు సన్మానించారు. 2022-23 విద్యా సంవత్సరంలో 17 మంది దివ్యాంగ విద్యార్థులు పాసై 100శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. దీనికి కృషి చేసిన మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడులను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధి

ప్రజాశక్తి-యంత్రాంగం:

జగనన్న సురక్ష పథకంలో అర్హులై ఉండి మిగిలి పోయిన లబ్ధిదారులకు మేలు చేకూరుతుందని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఈ కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి.

పరవాడ: మండలంలోని కన్నూరు, పెదమూషిడివాడ పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు చేతుల మీదుగా దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్‌లు గొల్లవిల్లి కృష్ణవేణి, పల్లా అప్పారావు నాగమణి, వైసిపి నాయకులకు కోటాన రాము, చుక్క రామునాయుడు, కోన రామారావు, నందవరపు శ్రీను, వెన్నెల సన్యాసిరావు, ఎంపీడీవో హేమ సుందరరావు, తహసీల్దార్ కనకరావు పాల్గొన్నారు.

కశింకోట : జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కలగా లక్ష్మి అన్నారు. మండలంలో తాళ్ళపాలెం, అచ్చర్ల పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష సమావేశం నిర్వహించారు. కులం, నివాసం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయనాయుడు, అచ్చర్ల సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, ఎమ్పిటిసి లగిశెట్టి భవానీ, అద్దంకి సతీష్, మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎమ్పిడిఓ రవికుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

వడ్డాది: బుచ్చయ్యపేట మండలం వడ్డాది సచివాలయం-1 పరిధిలో శుక్ర వారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉపసర్పంచ్ దాడి సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. 519 మంది లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను మంజూరు చేశారు. ఎంపీడీవో సువర్ణరాజు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, వీర్ల సురేష్, ఈవో లోవరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: నాతవరం మండలం గునుపూడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళలు సాంస్కృతిక చైర్మన్ జోగినాయుడు పాల్గొన్నారు. మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు, తహసిల్దార్ ఎస్ ఎస్వి నాయుడు, ప్రత్యేక అధికారి జీవీ లక్ష్మి పాల్గొన్నారు.

కొత్తకోట: అర్హులను గుర్తించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తూన్నట్టు రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు అన్నారు. మండలంలో కొత్తకోట సచివాలయం -2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సుమారు 856 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువ పత్రాలను అందజేశారు. గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, ఎంపిటిసి పూడి దేవ, ఆర్ఐ చిన్నబాయి, ఈఓ కృష్ణ మోహన్, వీఆర్వో లక్ష్మి, సుబ్బయ్య, మాజీ ఉప సర్పంచ్ కె. గున్నాజీ, వైసీపీ బిసి సెల్ అధ్యక్షులు బి.పాండు, ఎస్సి సెల్ అధ్యక్షులు అమ్మాజీ పాల్గొన్నారు.

నక్కపల్లి: ప్రజల ముంగిటకు ప్రభుత్వం సేవలు అందిస్తుందని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మండలంలోని గొడిచెర్ల, అమలాపురం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నానాజీ, ఈశ్వరరావు ఈ ఓ పి ఆర్ డి వెంకటనారాయణ, డీటీ నీరజ పాల్గొన్నారు.

చీడికాడ: ప్రజలకు పరిపూర్ణంగా సంక్షేమ ఫలాలు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని మండల ప్రత్యేక అధికారి మహేశ్వర్ అన్నారు. చీడికాడ తులసి కళ్యాణ మంటపంలో జగనన్న సురక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ జయమ్మ మాట్లాడుతూ, ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేస్తామని ఆమె తెలిపారు. జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి ఎంపీడీవో జయ ప్రకాష్‌రావు, తహసిల్దార్ బివి రాణి, హౌసింగ్ ఎఇ సూరిబాబు, ఎంపీటీసీ రావాడ మణి, మండల సచివాలయం కన్వీనర్ చైతన్య, గ్రామ వైసిపి కన్వీనర్ పరవాడ మహేష్, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, గ్రామ సర్పంచ్, వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత ధృవపత్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుర్ల బాబ్జి, గొలుగొండ మండల వైసిపి అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, ఎంపిటిసి సిహెచ్.బుల్లిప్రసాద్, సచివాలయ కార్యదర్శి రాజేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

కోటవురట్ల: జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగించుకోవాలని జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు కోరారు. శుక్రవారం మండలంలో కైలాస పట్నం, చిన్న బొడ్డేపల్లి గ్రామాలలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో



మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

అర్హులకు దుపత్రాలు అందజేశారు. చిన్న బొడ్డేపల్లి గ్రామంలో తహసిల్దారు జానకమ్మ, కైలాస పట్నం గ్రామంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, ఈఓపిఆర్‌డి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ లబ్ధి : ముత్తంశెట్టి

ఆనందపురం: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్లను అందించడం, వారి సమస్యలు పరిష్కరించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శవేములవలసలో జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. డిప్యూటీ కలెక్టర్, జగనన్న సురక్ష పథకం ప్రత్యేకాధికారి సంధ్యాపద్మ, ఎంపిడిఒ లవరాజు తహశీల్దార్ రామారావు, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు పాండ్రంగి శ్రీను, బోట్ట ధనలక్ష్మి రామకృష్ణ, వేములవలస ఎంపిటిసి కోరాడ సూర్యకుమారి, బిపి కల్లాల సర్పంచ్ కోన పైడిరాజు, శ్రీను పాల్గొన్నారు

పిఎం పాలెం: జివిఎంసి ఆరో వార్డు పిఎం పాలెంలో అవంతి ఫంక్షన్ హాల్ వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. బి2 కాలనీలో కమ్యూనిటీ హాలు ఏర్పాటు కోసం శంకుస్థాపన చేశారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, ఆరవ వార్డు కార్పొరేటర్, ముత్తంశెట్టి లక్ష్మి ప్రియాంక, ముత్తుంశెట్టి మహేష్, తహశీల్దార్ రమణయ్య, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, నగరాల చైర్మన్ పిల్లా సుజాత సత్యన్నారాయణ పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి, రేవిడి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పాండ్రంగిలో 140మందికి, రేవిడిలో 400మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి గిరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు లక్ష్మణ ఎంపిడిఒ విజయ్ కుమార్ తహశీల్దార్ శ్రీవల్లి పాల్గొన్నారు.

తగరపువలస : జగనన్న సురక్ష ద్వారా పలువురు లబ్ధిదారులకు ఎంపిపి, డివిఎస్ఎస్ఎన్ రాజు (వాసురాజు) ధ్రువ పత్రాలు అందజేశారు. భీమిలి మండలం, అమనాం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలోమాట్లాడారు. సర్పంచ్ ఉమాదేవి, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, పార్టీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

14న జాబ్ మేళా

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:అడ్డురోడ్డులోని ప్రజ్ఞ కాలేజ్‌లో ఈ నెల 14న మెగా జాబ్ మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ రాపర్తి రాము తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ, పాయకరావుపేట శాసన సభ్యులు గొల్ల బాబూరావు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 12 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తునట్టు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళకు సంబందించిన గోడ పత్రికను ఎమ్మెల్యే గొల్ల బాబూరావుచే ఆవిష్కరించారు. ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి నుండి పి .జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరాల లోపు యువతీ ,యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు ఫోన్: 8247505171, 8309561123,నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు అగ్రి ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలో రూ.2 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆగ్రి ల్యాబ్ ఈనెల 8న శనివారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చేతుల మీదుగా ప్రారంభం అవుతుందని ఎంపిపి పెదబాబు, మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 52 ఆగ్రి ల్యాబ్ లను మంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని తెలిపారు.అనంతరం టిటిడి కళ్యాణ మండపంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.


పనులు ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి

రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మాడుగుల: ఎం.కోడూరు గ్రామంలో శ్మశాన వాటిక కు రహదారి లేక గ్రామస్తులు అంత్యక్రియలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. దీంతో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదేశాల మేరకు సర్పంచ్ గోల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో రహదారి పనులు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. మాజీ జడ్పీటిసి ప్రభావతి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ వైసిపి అధ్యక్షులు పడాల అప్పలనాయుడు పాల్గొని మాట్లాడుతూ, ప్రజలకు ఎంతో అవసరం అయిన రహదారి నిర్మాణం మొదలు కావడం పట్ల మంత్రికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కే.కొండమ్మ, స్థానిక సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం అరకు సంతబయలులో పోస్టర్స్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కొండమ్మ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి వర్కర్లకు గ్రాడ్యుటి అమలు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేసి, హెల్పర్లకు ప్రమోషన్లు కల్పించే వయస్సును 50 ఏళ్ళు పెంచాలని, సర్వీసులో ఉండి మృతి చెందితే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.పవిత్ర, టి.సత్యవతి, కే.మల్లమ్మ, జీ.రుక్మిణి, రామలక్ష్మి, టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

రోడ్డు, పాఠశాల సౌకర్యం కల్పించాలని..

రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి- కోటవురట్ల:గొట్టివాడ శివారు అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యంలో అనుకు గ్రామానికి వెళ్లే దారిలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, గిరిజన గ్రామమైన అణుకు గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం, పాఠశాల లేక పోవడంతో 50 కుటుంబాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. శాసనసభ్యులు గొల్ల బాబురావు , జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాల్లో అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోక పోవడంతో నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ, గ్రామానికి సరైన రోడ్డు, పాఠశాల, మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారని ఎన్నిసార్లు అధికారులకు, నాయకులకు మొర పెట్టుకున్నా పట్టించు కోలేదన్నారు. అణుకు గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాల నుంచి తిరిగి వస్తు దీక్షశిబిరం వద్ద బైఠాయించారు. పాఠశాల, రోడ్డు సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి స్పష్టమైన హామీ ఇచ్చి నిధులు మంజూరు చేసే వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దేవిడ్‌రాజు, గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు

పథకాలతో పేదలకు లబ్ధి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-మాడుగుల:సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు ఆసరా లభించిందని ఉప ముఖ్యమంత్రి బూ డి ముత్యాల నాయుడు అన్నారు. శుక్రవారం ఒమ్మలిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పథకాలకు సామాన్య ప్రజల బతులకు బాటలు చూపుతున్నాయని అన్నారు. ఒక్క ఒమ్మలి పంచాయతీలో 15.5 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. 101 మంది లబ్దిదారులకు 1.81 కోట్లతో జగనన్న గృహాలు నిర్మాణం అవుతున్నాయని, 2 కోట్లతో ఇంటింటికీ మంచినీరు సరఫరా అమలు అవుతుందని తెలిపారు. సీసి రహదారులకు, కాలువలకు 20 లక్షలు మంజూరు చేశారు. సుమారు 65 లక్షలతో చేపడుతుతున్న నాడు నేడు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి, సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక నేతలతో కలసి గ్రామంలోని జగ్గీజీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, వైస్ ఎంపిపి లు రాజారామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


చిన్నారిని ఎత్తుకున్న బూడి

గ్రామాల్లో సమస్యల పరిష్కారం ఏదీ?

మండల సమావేశంలో సభ్యుల ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి-రోలుగుంట:ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో స్వపక్షనేతలైన వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అధికారులను నిలదీశారు. జలకళ నిధులతో రైతులకు పొలల్లో బోరుబావులు వేశారని,. కరెంట్ లైన్లు వేయలేదని, కుసర్లపూడి జగనన్న కాలనీలో రోడ్డు, రహదారి, కరెంట్ కల్పించలేదని ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితులు ఏర్పడ్డాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరేళ్లుగా అంగన్వాడీ భవనం బిల్డింగ్ బిల్లులు అందలేదని, ఆయా పనులను వైసిపి నేతలే కాంట్రాక్టు చేశారని విషయాన్ని అధికారులు పిఆర్ ఎఇ ఉమామహేశ్వరావు ప్రభుత్వానికి పెద్దలకు విన్నవించాలని కోరారు. స్థానిక నాయకులతో పాత పనులు చేయించుకోవడమే తప్పా సరైన ప్రాధాన్యత కల్పించడంలో వారికి కేటాయించిన నిధులు కాంట్రాక్టర్ చేసిన బిల్లులు ఇవ్వడంలో ప్రభుత్వం వెనుకబడిందన్నారు. ఈ సమావేశంలో కంచుగుమ్మల సర్పంచ్ బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రతీ సమావేశంలో తమ సమస్యను విన్నవించుకోవడమే కానీ న్యాయం జరగ లేదన్నారు. మా గ్రామ పరిధిలో సుమారు 60 ఎకరాల భూమిని ఎండోమెంట్ భూమిగా ఆన్‌లైన్ నమోదు కాబడిందని, వాస్తవానికి 12 ఎకరాల 80 సెంట్లు మాత్రమే ఎండోమెంట్ భూమి ఉందని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు విన్న వించడం జరిగిందన్నారు. దీనిపై తహశీల్దార్ వరహాలు స్పందించి డిప్యూటి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతానన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు, కుసర్లపూడి సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, జెడ్పీటీసీ పోతల రమణమ్మ, ఎంపిటిసి రామ్, సర్పంచ్‌లు పోతల రాజశేఖర్, ఉలబాల రాము, గుములూరు బాబులు, హౌసింగ్ ఎఇ , ఎంఇఒ జగ్గారావు, ఏపిఒ సూర్యమణి, వైద్యాధికారి రాజ్యలక్ష్మీ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.




సమస్యలను విన్నవిస్తున్న సభ్యులు

హెచ్‌ఎంకు యుటిఎఫ్ అభినందనలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టిన వి కృష్ణారావుకు స్థానిక యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేస్తూ ఈ స్థాయికి రావడం గర్వకారణమని చెప్పారు. పాఠశాల సిబ్బందితో సమన్వయం చేసుకొని, విద్యాభివృద్ధికి నూతన ప్రధాన ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బాలకృష్ణ, జిల్లా కౌన్సిలర్లు ఎస్.కన్నయ్య, ఎం.సత్యనారాయణ, టి.సుబ్బారావు, ఎం.మోహన్‌రావు, మండల నాయకులు ఎల్‌బి దుక్కు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు మొర

ప్రజాశక్తి -పెదబయలు:సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామంలో గడప గడపలో భాగంగా అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ శుక్రవారం పర్యటించారు. జోరు వర్షంలో తడుస్తూనే గడప గడపకు వెళ్లారు. గ్రామంలో సిసి రోడ్డు, డ్రైనేజి, మంచినీరు వంటి సమస్యలు పరిష్కారం చేయాలని మహిళలు కోరారు. పంచాయతీకు 40 లక్షలు మంజూరు చేశామని సంబంధిత ఇంజిరింగ్ అధికారులు ఎస్టిమేట్ వేసి ఎక్కడ ఏ ఏ సమస్యలున్నాయో ఈనెల 11న లిఖితంగా తెలియజేయాలన్నారు గ్రామవాలంటీర్ల ద్వారా సమస్యలు తెలియ జేయాలన్నారు.సిపిఎం మండల మహిళా అధ్యక్షురాలు టి.కౌసల్య మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి పంచాయతీ నిధులు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంతో ప్రజలు పనులు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కూడా బొంజుబాబు, సర్పంచి మాధవరావు, వైస్ సర్పంచ్ బోండా గంగాధరం, వైసిపీ నాయకులు గంపరాయి సూరయ్య పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే